సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 21 । జనవరి । 2024



సోమశిలలో 28.798 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 28.798 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 2 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	- రూ.64,360
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	-రూ.5,780
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,953
నవర (8 గ్రా)	- రూ.47,624

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.1 /23.0

శనివారం గాలిలో తేమ 60 శాతం ఉంది. ఉష్ణోగ్రత సాధారణ స్థితికి చేరింది. ఆదివారం కూడా ఎలాంటి మార్పులు ఉండబోవని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ఈ-క్రాప్ నమోదు సకాలంలో పూర్తి చేయండి

• జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి

పొదలకూరు: సబ్ డివిజన్ పరిధిలోని మండలాల అధికారులు, సిబ్బంది సకాలంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) సత్యవాణి తెలిపారు. పొదలకూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో శనివారం పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి, మనుబోలు మండలాల వీఏఏలకు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ లోపు పంటల నమోదును పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. యూరియా అవసరమైన వారు వెంటనే నివేదిక సమర్పిస్తే అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఏఓ కార్యాలయం ఏడీఏ నర్సోజీరావు, పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్, శేషగిరి, ఏఓలు పాల్గొన్నారు.

రైతులకు రూ.1.20 కోట్లు ఎగవేత

• కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): రైతుల నుంచి రూ.1.20 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించి దాని తాలూకు నగదు ఇవ్వకుండా మోసగించిన వారిపై బాలాజీనగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు బాలాజీనగర్ ఆంధ్రాబ్యాంకు వీధిలో ఎం.శ్రీరాములు నివాసం ఉంటున్నాడు. ఆయనకు కర్ణాటక రాష్ట్రం బళ్లారి సిరికుప్పకు చెందిన ధాన్యం వ్యాపారులు రమేష్, మంజు, హనుమాన్‌గౌడ్, రంగనాథగౌడ్‌లతో పరిచయం ఉంది. దీంతో వారు శ్రీరాములు సహకారంతో నెల్లూరు పరిసర ప్రాంతాల్లోని రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల రూ.1.20 కోట్ల విలువ చేసే 20 లారీల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అందుకు గాను రైతులకు శ్రీరాములు ష్యూరిటీగా ఉన్నారు. నెలలు గడుస్తున్నా వ్యాపారులు ధాన్యం తాలూకు నగదు చెల్లించకుండా కాలయాపన చేయసాగారు. నగదు చెల్లించాలని శ్రీరాములు వారిని నిలదీసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో వ్యాపారుల మోసంపై శనివారం శ్రీరాములు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్ నిందితులపై కేసు నమోదు చేశారు.

రేపు డయల్ యువర్ ఆర్‌ఎం

నెల్లూరు సిటీ: జిల్లా పరిధిలోని ఆర్టీసీ బస్సు సర్వీసులకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు సోమవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పీవీ శేషయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ఆర్‌ఎంతో మాట్లాడేందుకు 0861-2325196 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

తలసేమియా చిన్నారులకు వైద్యపరీక్షలు

నెల్లూరు సిటీ : నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో 50 మంది తలసేమియా చిన్నారులకు షుగర్, థైరాయిడ్, గ్రోత్, లైంగిక పరిపక్వత తదితర వైద్యపరీక్షలను ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ అమరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల ద్వారా తలసేమియా చిన్నారుల శరీరాల్లో వచ్చే మార్పులు తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమాలను రెడ్‌క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, అడ్వైజర్ డాక్టర్ హరిత, కన్వీనర్ డాక్టర్ సీత, కో కన్వీనర్ పర్వీన్ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ కన్వీనర్ సీహెచ్ అజయ్‌బాబు, కన్వీనర్ ఎ.సాయిరామ్, సెక్రటరీ మస్తానయ్య పాల్గొన్నారు.

టీడీపీలో అంతర్మథనం



తాజా సర్వేల్లో వైఎస్సార్‌సీపీదే మళ్లీ హవా



- రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీకి గెలుపు ఖాయం
- పునరావృతం కానున్న 2019 ఎన్నికల ఫలితాలు
- తలలు పట్టుకుంటున్న 'దేశం' అధినాయకత్వం

తాజాగా టీడీపీ చేయించిన సర్వేలు ఆ పార్టీని నిరుత్సాహానికి గురిచేస్తున్నాయి. టీడీపీ గ్రాఫ్ ఏ మాత్రం పెరగలేదని సర్వేలు చెబుతున్నాయి. సర్వే ఫలితాలు ఆ పార్టీకి అనుకూలంగా రాకపోగా అధికార వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా రావడంతో టీడీపీ నేతలు మరింత షాక్‌కు గురయ్యారని తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి జిల్లాలో విజయదుందుభి మోగిస్తుందని సర్వే ఫలితాలు చెబుతుండడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో టీడీపీ గ్రాఫ్ రోజు రోజుకూ దిగజారిపోతోందని ఆ పార్టీ చేయిస్తున్న తాజా సర్వేలే చెబుతున్నాయి. ఇటీవల జిల్లాలో టీడీపీ పరిస్థితిపై ప్రైవేట్ సంస్థల ద్వారా ఆ పార్టీ నేతలు సర్వే చేయించారు. దాదాపు 25 రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో ఉన్న 10 నియోజకవర్గాల్లో రెండు విడతలుగా సర్వే చేయించుకోగా, ఆ ఫలితాలను చూసి టీడీపీ నేతలకు దిమ్మతిరిగినట్లు తెలుస్తోంది. పదింటిలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం దాదాపు ఖరారైనట్లు తాజా సర్వేల్లో తేటతెల్లం కావడంతో టీడీపీ అధిష్టానం తలలు పట్టుకుంటోంది. ఎన్నికలకు అతికొద్ది సమయమే ఉండడంతో పార్టీ గ్రాఫ్ ఎలా పెంచాలో పార్టీ అధిష్టానానికి అర్థంకావడం లేదు. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు తప్పదేమో అని జోరుగా ప్రచారం సాగుతోంది.

అయోమయంలో టీడీపీ అధిష్టానం

ఉమ్మడి జిల్లాలో ఉన్న పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ రెండు ప్రైవేటు సంస్థల ద్వారా తాజాగా సర్వేలు చేయించుకుంది. డిసెంబర్ 15 నుంచి జనవరి 12వ తేదీ వరకు టీడీపీ ఈ సర్వేలు చేయించింది. ఆయా సర్వేల్లో ప్రతి నియోజకవర్గంలోనూ దాదాపు 1,500 మందికి తగ్గకుండా అన్నివర్గాల వారి అభిప్రాయాలను సేకరించారు. దాదాపు ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 6 నుంచి 7 శాతం మంది అదనంగా వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపారని సమాచారం. దీంతో అన్ని నియోజకవర్గాల్లో మెజారిటీ ఓటర్లు వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నట్లుగా ఆయా సర్వేల ద్వారా తేలింది.

అధికార పార్టీకి మరింత ఆదరణ

2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి సత్తా చాటింది. జిల్లాలో వైఎస్సార్‌సీపీకి తిరుగులేదని ఓటర్లు నిరూపించారు. గడిచిన నాలుగన్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక 99 శాతం అమలు చేయడంతో పేదవర్గాల్లో అధికార వైఎస్సార్‌సీపీకి ఆదరణ మరింత పెరిగింది. దీంతో ఓటర్లు మరోసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం కల్పించాలనే సంకల్పంతో ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. గత టీడీపీ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలు, వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన గురించి సామాన్యులు బేరీజు వేసుకుంటున్నారు. దీంతో ఎటుచూసినా టీడీపీ గ్రాఫ్ పెరగలేదని సర్వేల్లో స్పష్టమైంది.

జిల్లా టీడీపీలో నాయకత్వ లోపం కన్పిస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో ఆ పార్టీ నేతలు మూడు గ్రూపులు, ఆరు వర్గాలుగా చెదిరిపోయారు. దీంతో వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే సత్తా ఉన్న నేతలు కరువయ్యారు. టీడీపీలో సీనియర్లుగా ఉన్న నేతలు సైతం వసూళ్ల కోసం అర్రులు చాచిన సందర్భాలు వెలుగులోకి వచ్చాయి. అధికార పక్షంలో ఉన్నప్పుడే కాకుండా ప్రతిపక్షంలో కూడా వసూళ్లు చేసుకున్న ఘనత టీడీపీ సీనియర్ నేతలకే దక్కుతోంది. గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ముఖం చాటేశారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పార్టీలో ఉత్సాహం కరువైంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలను టీడీపీ తమ పార్టీలోకి ఆహ్వానించింది. అందులో ఇద్దరు ఎమ్మెల్యేలు కండువా కప్పుకోకుండానే జెండాను ఎత్తుకున్నారు. మరో ఎమ్మెల్యే పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ ముగ్గురు వెళ్లినా టీడీపీ గ్రాఫ్ ఏ మాత్రం పెరగలేదని సర్వేలు చెబుతున్నాయి. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు టీడీపీలోకి వెళ్లడంతో స్థానికంగా ఉన్న ఆ పార్టీ నేతలు అలకబూనారు. నమ్మి జెండా మోసిన మాకే టీడీపీ అధినేత చంద్రబాబు ద్రోహం చేశారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఒకవేళ ఆ ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా వారితో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని స్థానిక టీడీపీ నేతలు తెగేసి చెబుతుండడం గమనార్హం.

1.22 కోట్ల ఉపాధి పనిదినాలు

• డ్వామా పీడీ వెంకట్రావ్



నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనులకు సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1.22 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారని, ఆ లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. శనివారం నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. హౌసింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వారికి హౌసింగ్ ప్రక్రియ వర్తిస్తుందని తెలిపారు. జిల్లాకు 4,400 ఫాంపాండ్స్ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కారు టైర్ పంక్చరై ఒకరి మృతి

కావలి: కారు టైర్ పంక్చరై అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఫెన్సింగ్ రాళ్లను, అనంతరం చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన కావలి మండలం ఎన్‌హెచ్-16పై ముసునూరు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై సుమన్ తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన శ్రీనివాస్(39) లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ పదేళ్ల క్రితం బెంగళూరులోని బొమ్మనహళ్లి గ్రామానికి చెందిన ఆయేషాను వివాహం చేసుకున్నాడు. వారికి 3 నెలల పాప ఉంది. రెండు రోజుల క్రితం తన భార్యను, కుమార్తెను బొమ్మనహళ్లిలో వదిలి శుక్రవారం రాత్రి తన సొంతూరికి కారులో బయలుదేరాడు. కావలి మండలం ముసునూరు సమీపంలోకి చేరుకోగానే కారు టైర్ పంక్చరై అదుపుతప్పి రోడ్డు పక్కన ఫెన్సింగ్ రాళ్లను, అనంతరం చెట్టును ఢీకొనడంతో శ్రీనివాస్ మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మహో లింగేశ్వరా..సర్వ శుభంకరా



పాదరస లింగేశ్వరునికి హారతి ఇస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- శాస్త్రోక్తంగా పాదరస లింగేశ్వరునికి మహా రుద్రాభిషేకం
- శివ నామస్మరణతో మారుమోగిన నార్తురాజుపాళెం
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజలు

కొడవలూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదరస లింగేశ్వరునికి నిర్వహించిన మహా రుద్రాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో శనివారం నిర్వహించిన ఈ బృహత్తర కార్యక్రమానికి జిల్లా నలువైపుల నుంచి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల్లోనే నూతనంగా నిర్వహించిన కార్యక్రమం కావడం, పాదరస లింగాన్ని పూజిస్తే 40 రోజుల్లో ఫలితం ఉంటుందనే నమ్మకంతో ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రజలు విశేషంగా తరలివచ్చారు. దీంతో భక్తుల శివ నామస్మరణలతో నార్తురాజుపాళెం మారుమోగింది. స్వామివారిని దర్శించుకుని వెళదామని వచ్చిన భక్తులు సాయంత్రం వరకు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని తరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, పులివేషం, జానపద నృత్యాలు, రాక్షస వేషధారణలు, గిరిజన నృత్యాలు అలరించాయి.

తరలివచ్చిన ప్రజాప్రతినిధులు

ఎంతో విశిష్టత కలిగిన పాదరస లింగేశ్వరుని మహా రుద్రాభిషేకానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు - కళ్యాణి దంపతులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని వేద పండితుల ఆశీస్సులు తీసుకున్నారు. ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, నెల్లూరు నగర మేయర్ స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం జరిగిన శివపార్వతుల కల్యాణోత్సవానికి డిప్యూటీ సీఎం నారాయణ స్వామి హాజరై కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఏపీఎల్టీఏ, డీఏబీ చైర్మన్లు గొల్లపల్లి విజయకుమార్, డి.నిరంజన్‌బాబురెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కె.అనిల్‌బాబు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు జి.వెంకటశేషయ్య, ఎం.శ్రీనివాసులు రెడ్డి, సీహెచ్ సతీష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ఎన్.సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ కె.శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ బి.సుప్రియ, నాయకులు మాణిక్యరావు, ఎండీ కరిముల్లా, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రుద్రాక్షలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



స్వామికి రుద్రాక్షలు సమర్పిస్తున్న మంత్రి కాకాణి



పూజల్లో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు



శివుడిని అర్చిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



పూజలు చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి



ఈవీఎంల భద్రతకు టీఆర్‌ఆర్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

• కలెక్టర్ హరినారాయణన్

కందుకూరు: త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కందుకూరు నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలను భద్రపరచడం, ఈవీఎంల ర్యాండమైజేషన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం కోసం శనివారం స్థానిక టీఆర్ జూనియర్ కాలేజీ భవనాన్ని ఆయన పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉండే గదులను ఎంపిక చేసుకుని ఈవీఎంల కోసం వినియోగించుకోవాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, ర్యాంపులు వంటివి ఈ నెల 31వ తేదీ లోపు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలని, 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల దినోత్సవం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించాలన్నారు. అలాగే కళాశాలల్లో ఓటర్ల దినోత్సవం నిర్వహించి యువతతో ఓటర్ ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ విద్యాధరి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, కాలేజీ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు కింద ఆరుతడి పంటలకు నీరిచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు పలువురు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం రాళ్లపాడు ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఆరుతడి పంటలకు నీరు ఇచ్చే అంశంపై చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కలెక్టర్ హరినారాయణన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత త్వరగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

మాలకొండను సందర్శించిన కలెక్టర్

వలేటివారిపాళెం : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని కలెక్టర్ హరినారాయణన్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యానిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ఆలయ ప్రధానార్చకుడు గౌరీశంకర్ ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం భక్తులకు అల్పాహారం, అన్నదానం చేయడం చాలా మంచి కార్యక్రమమన్నారు. భక్తులకు వసతులు చాలా బాగున్నాయని అభినందించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.44
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

అక్రమ మద్యం కేసులో సూరా అరెస్ట్

కోవూరు: బుచ్చిరెడ్డిపాళెం వవ్వేరు కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డిని పోలీసులు అక్రమ మద్యం కేసులో అరెస్ట్ చేశారు. బుచ్చి పోలీసుల కథనం మేరకు. సూరాకు చెందిన బార్‌పై శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం అమ్ముతుండగా అశోక్‌రెడ్డి, తిరుపాల్ అనే ఇద్దరిని పట్టుకున్నారు. వారిని విచారించగా తమకు ఏమీ తెలియదని బార్ యజమాని అయిన సూరా శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకే అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తున్నారని కేసు నమోదు చేశారు. శనివారం నెల్లూరులో శ్రీనివాసులురెడ్డిని అరెస్ట్ చేసినట్లు సీఐ హైమారావు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఇనమడుగులో బంగారం, వెండి చోరీ

కోవూరు: ఇనమడుగు పంచాయతీలో ఉన్న సత్యానంద ఆశ్రమ సమీపంలో బి.సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో బంగారం, వెండి చోరీ జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సంక్రాంతి నేపథ్యంలో సుధాకర్‌రెడ్డి తన కుటుంబంతో బెంగళూరులో ఉంటున్న తన కుమారులు దగ్గరకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దుండగులు గురువారం అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి బీరువాలోని పది సవర్ల బంగారం, కేజీ వెండి, రూ.45 వేల నగదును అపహరించుకెళ్లారు. శుక్రవారం రాత్రి సుధాకర్‌రెడ్డి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని పక్కింటి వారు చూశారు. ఆ కుటుంబం తిరిగి వచ్చిందనుకుని వారిని పిలవగా సమాధానం రాలేదు. దీంతో కోవూరు పోలీసులకు, అలాగే బాధితులకు సమాచారం అందించారు. శనివారం ట్రెయినీ డీఎస్పీ హేమలత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం బీరువా వద్ద వేలిముద్రలను సేకరించింది.

అల్లుడిపై అత్తమామల దాడి

అనుమసముద్రంపేట: అల్లుడిపై అత్తమామలు దాడి చేసిన ఘటన మండలంలోని పెద్దబ్బీపురం గ్రామంలో జరగ్గా శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు కృష్ణారెడ్డి కథనం మేరకు.. కలువాయి మండలం నూకనపల్లికి చెందిన కృష్ణారెడ్డికి పెద్దబ్బీపురం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, గోపాల్‌రెడ్డిల కుమార్తె విజయమ్మతో వివాహమైంది. కొంతకాలం వారి కాపురం సజావుగానే సాగింది. మూడేళ్ల క్రితం భార్య మానసికంగా బాగోలేదంటూ పుట్టింట్లో వదిలాడు. కృష్ణారెడ్డి రామాయపట్నంలో విధులు నిర్వహిస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా భార్య, పిల్లలను చూసేందుకు పెద్దబ్బీపురం వెళ్లి అక్కడే ఉన్నాడు. 18వ తేదీ రాత్రి కృష్ణారెడ్డికి, అత్తమామల మధ్య గొడవ జరిగింది. తనపై దాడి చేయడమే కాకుండా పోలీసులకు సైతం చెప్పి కొట్టించారని కృష్ణారెడ్డి ఆరోపిస్తున్నాడు. ప్రస్తుతం ఆత్మకూరు జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 113
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 145

కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి..

- బంగారు ఆభరణాల దోపిడీ

నెల్లూరు(క్రైమ్): అద్దెకుంటున్న వ్యక్తి మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్‌ను ఇంటి యజమానురాలికి ఇచ్చి బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఘటన నెల్లూరులోని ఉమ్మారెడ్డిగుంటలో జరిగింది. ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటకు చెందిన కమలమ్మ భర్త రాములు కొంతకాలం క్రితం మృతిచెందాడు. ప్రస్తుతం 77 సంవత్సరాల వయసున్న ఆమె ఒంటరిగా ఉంటోంది. కుమార్తె శ్యామలకు వివాహమై నగరంలో భర్తతో కలిసి జీవిస్తోంది. రెండు నెలల క్రితం కమలమ్మ ఇంట్లో శ్రీకాకుళానికి చెందిన నరేంద్ర తన తల్లిదండ్రులతో కలిసి అద్దెకు దిగాడు. వృద్ధురాలికి తోడుగా ఉంటూ ఎంతో నమ్మకంగా వ్యవహరించాడు. సంక్రాంతి పండగకు నరేంద్ర తల్లిదండ్రులు స్వగ్రామానికి వెళ్లారు. యజమానురాలి ఒంటిపై బంగారు ఆభరణాలు ఉండటంతో ఎలాగైనా వాటిని కాజేయాలని నరేంద్ర నిర్ణయించుకున్నాడు. అతను శుక్రవారం సాయంత్రం మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్‌ను కమలమ్మకు ఇచ్చాడు. తాగిన కొద్దిసేపటికి ఆమెకు మైకం కమ్మడంతో నిద్రపోయింది. రాత్రి పదిగంటల ప్రాంతంలో నరేంద్ర చీరతో ఆమె మెడను బిగించి, కర్రతో తలపై బలంగా కొట్టి చంపుతానని బెదిరించాడు. ఒంటిపైనున్న సుమారు రూ.2 లక్షల విలువ చేసే ఆరున్నర సవర్ల బంగారు గాజులు, గొలుసు, తెల్లరాయి ఉంగరాన్ని దోచుకుని పరారయ్యాడు. ఆమె కొద్దిసేపటికి తేరుకుని తన కుమార్తెకు జరిగిన విషయాన్ని తెలియజేసింది. కుమార్తె, అల్లుడు ఇంటికి చేరుకుని కమలమ్మను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. శనివారం బాధితురాలు దోపిడీ ఘటనపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకోనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.